
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 6 అక్టోబరు 2024



నేటి అలంకారం
శ్రీలలితా త్రిపురసుందరీ దేవి





అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మాంపాహి మాతాన్నపూర్ణేశ్వరి

పరమేశ్వరుడికే అన్నప్రసాదాన్ని భిక్షగా పెట్టిన జగన్మాతను అన్నపూర్ణాదేవి అలంకారంలో చూసి అశేష భక్తకోటి తన్మయత్వం పొందింది. కిలోమీటర్లకొద్దీ నడిచి అమ్మ దర్శనంతో పునీతమైన భక్తులు.. ఆనక అన్నప్రసాదాన్ని స్వీకరించి ధన్యులయ్యారు. భక్తుల జయజయధ్వానాలు.. కుంకుమార్చనల్లో ఉభయదాతల మంత్రోచ్ఛారణలు.. సువాసినీ పూజల్లో బాలికల వేదమంత్రాలు.. ఇలా ఇంద్రకీలాద్రిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణమే కనిపించింది. ఉత్తరాంధ్ర భక్తుల రాకతో అమ్మ నామస్మరణలు అంబరాన్ని తాకుతున్నాయి.



కుంకుమపూజలో దంపతులు



దుర్గాఘాట్‌లో నవహారతులు

ఇంద్రకీలాద్రికి పోటెత్తుతున్న భక్తులు

అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మ దర్శనం • అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తజనం • ఉత్తరాంధ్ర నుంచి భక్తుల రాక ప్రారంభం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో శనివారం దుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చింది. తెల్లవారుజాము నుంచి క్యూలు కాస్తంత పలచగా కనిపించినా, ఉదయం 10 గంటలు దాటాక భక్తుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. వీవీఐపీ దర్శనాలు అరగంటలో పూర్తవుతుంటే, సామాన్య భక్తులకు నాలుగైదు గంటల సమయం పడుతోంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తుల రాక మొదలైంది. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. శనివారం వారే ఎక్కువగా కనిపించారు. అమ్మవారిని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి దర్శించుకున్నారు. మహామండపంలోని ఆరో అంతస్థులో రెండు విడతలుగా కుంకుమార్చనలు నిర్వహించారు. మొదటి విడతలో 82 మంది, రెండో విడతలో 75 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ద్వారకాతిరుమల ఆలయ చైర్మన్ కుటుంబ సభ్యులు, ఈవో మూర్తి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గడిచిన ఏడాది కంటే ఈ ఏడాది అమ్మవారికి ఇచ్చే కానుకల సంఖ్య పెరిగింది. కాగా, మోడల్ గెస్ట్‌హౌస్ నుంచి కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖరబాబు ఆలయ ప్రాంగణం మొత్తాన్ని నిత్యం పరిశీలిస్తున్నారు. ఏమైనా లోటుపాట్లు కనిపించినప్పుడు వైర్‌లెస్ సెట్‌లో ఆదేశాలు ఇస్తున్నారు.



కనకదుర్గానగర్‌లో నగరోత్సవం

ఎంత నష్టమొచ్చినా చార్జీలు పెంచబోం..

ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల బాధ్యతల స్వీకారం

» ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



కొనకళ్లను అభినందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, నటుడు సుమన్

బస్‌స్టేషన్, అక్టోబరు 5 : ఆర్టీసీకి ఎంత నష్టమొచ్చినా చార్జీలు పెంచకుండా సేవలందిస్తామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు హామీ ఇచ్చారు. పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలోని ఆర్టీసీ హౌస్‌లో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. 30 ఏళ్లుగా తాను ఆర్టీసీ సంఘాలకు గౌరవాధ్యక్షుడిగా ఉన్నానని, ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరగా చూశానని చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మెరుగైన వైద్యం అందిస్తానని తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన, సులువైన రవాణా సౌకర్యాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొంచెం ఆలస్యమైనా పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా గుర్తింపు వస్తుందన్నారు. ఇందుకు తానే నిదర్శనమని చెప్పారు. సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేందుకు కృషిచేస్తానన్నారు. ఉద్యోగులు ఎంత ముఖ్యమో, ప్రయాణికులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా త్వరలో మరిన్ని కొత్త బస్సులు ప్రారంభిస్తామని చెప్పారు. త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తెస్తామని, చార్జింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్టీసీ ఖర్చులు తగ్గించేందుకు ప్రయత్నిస్తామన్నారు. మిగతా రాష్ట్రాల్లోని ఆర్టీసీలతో పోలిస్తే 92 శాతం బస్సులతో ఏపీఎస్‌ఆర్టీసీ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యంగా ఉందన్నారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు, కార్గోను విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని కొనకళ్ల పేర్కొన్నారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి ఆయన నూతన ఇంద్ర బస్సులను ప్రారంభించారు. తొలుత కొనకళ్ల నారాయణరావుకు ఆర్టీసీ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి స్వాగతం పలికారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవివర్మ, చంద్రశేఖర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నటుడు సమన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలిపారు. అద్దె బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వరరెడ్డి, సంఘం సభ్యులు, ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సత్కరించారు.

హద్దు దాటి..

మళ్లీ పోలవరం మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు

నగరానికి చెందిన ఎమ్మెల్యే అనుచరులమంటూ హడావిడి

- మరో నియోజకవర్గ పరిధిలో తవ్వకాలు
- తమ పరిధిలో తవ్వకాలు జరపొద్దన్న అక్కడి ఎమ్మెల్యే
- టీడీపీ చోటా నాయకులతో వైసీపీ నేతల కుమ్మక్కు
- తెరపైన వారిని పెట్టి అడ్డగోలు తవ్వకాలు

కొండపల్లి.. గుబ్బలగుట్ట.. చిలకలబీడు కొండ.. పోలవరం కాల్వకట్టలు.. వైసీపీ హయాంలో వేటినీ వదలకుండా తవ్వి సొమ్ము చేసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు, పోలవరం మట్టి తరలింపునకు అడ్డుకట్ట పడుతుందని అంతా భావించారు. కానీ, తెరపైన నాయకులు మారారే తప్ప అక్రమ తవ్వకాలు మాత్రం ఆగలేదు. పైగా అధికార పార్టీ ఎమ్మెల్యేల నడుమ గ్రావెల్, మట్టి తవ్వకాలు సరిహద్దు సమస్యలను తెచ్చిపెడుతున్నాయి.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో పోలవరం కొండలు.. గుట్టలు.. కుడికాల్వ కట్టలను ఆ పార్టీ నేతలు కరిగించేశారు. విచ్చలవిడిగా తవ్వి సొమ్ము చేసుకున్నారు. తాజాగా మళ్లీ మట్టి, గ్రావెల్ తవ్వకాలు ప్రారంభమయ్యాయి. విజయవాడ నగరానికి చెందిన ఓ ఎమ్మెల్యే అనుచరులమంటూ కొందరు ఇటీవల విజయవాడ రూరల్‌లో గ్రావెల్ తవ్వకాలతో పాటు పోలవరం కట్టలను తవ్వడం ప్రారంభించారు. గత ప్రభుత్వంలో తవ్విన వైసీపీ నేతలే తాజాగా కొందరు స్థానిక టీడీపీ నాయకులను తెరముందుంచి, ఎమ్మెల్యేల పేరు చెబుతూ పోలవరం కట్టలను తవ్వుకుంటుండటం గమనార్హం. వారు తవ్వుతున్న ప్రాంతం వేరే నియోజకవర్గ ఎమ్మెల్యే పరిధిలో ఉండటంతో ఈ విషయం ఆయనకు తెలిసింది. దీంతో తనకు చెడ్డపేరు వస్తుందన్న ఉద్దేశంతో ఆగమేఘాలపై ఆయన అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. అధికారులను పంపి అనుమతులు ఉన్నాయో లేవో తెలుసుకుని, లేకుంటే వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అక్కడకు వెళ్లిన అధికారులకు ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసి రెండు జేసీబీలు, రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఈ విషయం తెలియడంతో అధికార పార్టీకి చెందిన స్థానిక చోటా నాయకులు రంగంలోకి దిగారు. తమ ఎమ్మెల్యే తవ్వుకోమంటే ఆపడానికి మీరెవరంటూ అధికారులపై వీరంగమాడారు. అక్కడికి వచ్చిన పోలీసులతో మీపై అధికారి నా స్నేహితుడే ఆయనతో మాట్లాడతాను.. మీ సంగతి తేలుస్తానంటూ రెచ్చిపోయారు.



మళ్లీ అదే ప్రాంతంలో..

విజయవాడ రూరల్ పరిధిలోని పాతపాడులో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో చిలకలబీడు కొండ, జానకమ్మ కుంట రక్షిత అటవీ ప్రాంతం కింద ఉన్నాయి. అటవీ సర్వే నెంబరు 309, 310, 311ల్లో విస్తరించి ఉన్న ఈ భూముల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫారెస్ట్ సర్వేరాళ్లను మాయంచేసి మరీ తవ్వకాలు చేశారు. మళ్లీ ఇదే ప్రాంతంలో తవ్వకాలకు శ్రీకారం చుట్టారు. గతంలో ఎవరైతే తవ్వారో అదే వైసీపీ నాయకులు చోటా టీడీపీ నాయకులను తెరముందు పెట్టి ఈ తవ్వకాలు ప్రారంభించారు.

- విజయవాడ రూరల్ మండలం వేమవరం గ్రామంలోని సర్వే నెంబర్లు 147, 148ల్లో పదుల ఎకరాల్లో వైసీపీ హయాంలో 20 నుంచి 40 అడుగుల లోతున గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. సర్వే నెంబర్ 147/6లో అయితే ఏకంగా సుమారు ఎకరం విస్తీర్ణంలో 20 అడుగుల లోతున భారీ గుంతలు కనిపిస్తుంటాయి. మళ్లీ ఇదే గ్రామంలో గ్రావెల్ తవ్వకాలు జోరందుకున్నాయి.

- విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు, తాడేపల్లి, వేమవరం గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిగినట్టు గతంలో విజిలెన్స్ బృందం నిర్ధారించింది. 2023, డిసెంబరులో ఆయా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ బృందం అక్రమ తవ్వకాలు జరిగినట్లు పేర్కొంది. అప్పటి వైసీపీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు ఇక్కడ తవ్వకాల్లో కీలకపాత్ర పోషించారు. మళ్లీ కొద్ది రోజులుగా ఇక్కడ తవ్వకాలు మొదలయ్యాయి. గతంలో విజిలెన్స్ నివేదికలో ఎవరి పేర్లయితే ప్రస్తావించారో వారే మళ్లీ ప్రస్తుత తవ్వకాల్లో కీలకపాత్ర పోషిస్తుండటం గమనార్హం.

తుక్కునూ మెక్కేశారు

గుడివాడ మున్సిపాలిటీ, పంచాయతీల్లో వైసీపీ నేతల నిర్వాకం

- ఐదేళ్ల పాలనలో స్క్రాప్ మాయాజాలం
- అందినకాడికి దోచేసిన నాయకులు
- పిల్లల ఆటపరికరాలనూ వదల్లేదు
- మున్సిపల్ చైర్మన్ పాతకారు, 100 విద్యుత్ స్తంభాలు కూడా..
- టీడీపీ నేతల పరిశీలనలో బయటపడిన నిజాలు

గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో మాజీమంత్రి కొడాలి నాని, ఆయన అనుచరులు చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. దేనినీ వదిలిపెట్టకుండా అన్నీ దోచుకుతిన్నారు. ఆఖరుకు పిల్లలు ఆట పరికరాలు, విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన కార్లను సైతం వదలకుండా దోచేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో గుడివాడ మున్సిపాలిటీ, పంచాయతీల్లో జరిగినే అనేక స్క్రాప్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి.

గుడివాడ : స్థానిక ఏజేకే మున్సిపల్ ఉన్నత పాఠశాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి కొన్న ఆట వస్తువులను రాత్రికి రాత్రే వైసీపీ నాయకులు మాయం చేశారు. అలాగే, స్థానిక కప్పలబడిలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అదనపు తరగతి గదులు నిర్మించగా, ఆ క్రమంలో అక్కడ నిల్వ చేసిన లక్షలాది రూపాయల విలువైన పాత ఇనుమును తరలించి అమ్ముకున్నారు. అలాగే, వినియోగంలో లేకుండా పాత మున్సిపల్ కార్యాలయం పక్కన రేకుల షెడ్డులో ఉంచిన అంబాసిడర్‌ను చాకచక్యంగా

- మిగతా 6లో

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

6లో

» ఇద్దరు యువకుల దుర్మరణం..మరో బాలుడికి స్వల్ప గాయాలు.. వెల్లంకిలో విషాదఛాయలు



అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జయహో.. జగన్మాత

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ.. అమ్మవారి దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

దసరా మహోత్సవాల్లో మూడో రోజైన శనివారం ఇంద్రకీలాద్రిపై అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జయహో..జగన్మాత అంటూ ఉప్పొంగిన భక్తిభావంతో నినదించారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



హారతి అందుకుంటున్న భక్తులు



అంతరాలయంలో భక్తుల రద్దీ





కిటకిటలాడుతున్న క్యూలైన్లు

దసరా ఉత్సవాల్లో ఏర్పాట్లపై మీ అభిప్రాయం ఏంటి?

- భక్తుల ఆలోచన తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఫీడ్‌బ్యాక్ యాప్
- అందుబాటులోకి తేవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం వినూత్న ఆలోచన చేసింది. కలెక్టర్ సృజన ఇందుకోసం ఒక ప్రత్యేక యాప్‌ను తీసుకురావాలని నిర్ణయించారు. శనివారం కొండపైన ఏర్పాట్లను పర్యవేక్షించాక దేవస్థానం అధికారులతో తన మనసులోని ఆలోచనను కలెక్టర్ వెల్లడించారు. ఎన్ఐసీ టీమ్ ద్వారా యుద్ధ ప్రాతిపదికన ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆలయ పరిసరాలు, కొండదిగువన, క్యూలైన్లలో ప్రచారం యాప్‌పై కల్పిస్తారు. అమ్మను దర్శించుకున్న భక్తులు ఎలా ఫీల్ అవుతున్నారు? సౌకర్యాలు ఎలా ఉన్నాయి? ఎక్కడైనా అసౌకర్యం కలిగిందా? నిర్వహణ మరింత మెరుగు పరుచుకోవటానికి రద్దీని క్రమబద్ధీకరించటానికి ఇచ్చే సూచన ఏంటి? మూలానక్షత్రం రోజున ఎలాంటి ఏర్పాట్లు ఉండాలని కోరుకుంటున్నారు? శాఖలన్నీ సమన్వయంగా చేయాల్సిన పనులేమైనా ఉన్నాయా? క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఇంకా ఏ సౌకర్యాలు కల్పించాలి? కొండ దిగువన ఎలాంటి సౌకర్యాలు కల్పించాలి? లడ్డూ ప్రసాదాల నాణ్యత ఎలా ఉంది? అనే ప్రశ్నలను పొందుపరిచి భక్తులు నుంచి నేరుగా సమాధానాలు రాబట్టేలా యాప్‌ను రూపొందిస్తున్నారు. భక్తులు సొంతంగా ఏదైనా ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలనుకున్నా దానికీ అవకాశం కల్పించాలని నిర్ణయించారు. యాప్‌ను రేపటిలోగా తీసుకొచ్చే అవకాశం ఉంది. సలహాలు, సూచనలను అనుసరించి జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్ యంత్రాంగం, దేవస్థానం, పోలీసు యంత్రాంగాలు చర్యలు తీసుకోనున్నారు.

కనరో.. భాగ్యము!

ఇంద్రకీలాద్రి దిగి పతీసమేతంగా భక్తుల చెంతకు అమ్మవారు



తిరుమల మాడవీధుల తరహాలో..ఆది దంపతుల నగరోత్సవం

ఉత్సవాల్లో భాగంగా రోజూ సాయంత్రం కనకదుర్గానగర్ వీధుల్లో మేళతాళాలు, నృత్యాలు, కోలాటాలతో అట్టహాసంగా ఊరేగింపు

తిరుమల బ్రహోత్సవాల్లో మాడవీధుల్లో స్వామి ఊరేగింపు తరహాలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోనూ దసరా మహోత్సవాల్లో ఆదిదంపతుల నగరోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దుర్గా మల్లేశ్వరులను దర్శించుకోవడానికి వందల కిలోమీటర్ల నుంచి నడుచు కుంటూ ఇంద్రకీలాద్రికి చేరుకునే భక్తులు, క్యూలలో కాలినడకన వచ్చే భక్తులకు సాంత్వన కలిగించడానికి ఆదిదంపతులే కొండ దిగి కిందకు వచ్చి రోజూ సాయంత్రం భక్తులకు దర్శనం ఇవ్వటం ఈ నగరోత్సవం ప్రత్యేకత...కానీ, ఈ కార్యక్రమానికి దేవస్థానం అధికారులు తగిన ప్రచారాన్ని కల్పించలేకపోయారు.



పల్లకిపై ఊరేగుతున్న ఆది దంపతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /వన్‌టౌన్): నగరోత్సవాన్ని నిర్వహించే ముందు దుర్గామల్లేశ్వర దేవస్థానం అధికారులు, వేద పండితులు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సంప్రదించారు. అక్కడి వేద పండితులతో చర్చించాక గంగా, పార్వతీ సమేత పరమేశ్వరుడు (ఆది దంపతుల)ను ఊరేగిస్తూ నగరోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. 2016 దసరా ఉత్సవాల సందర్భంగా తలపెట్టిన ఈ నగరో త్సవం ఎనిమిదేళ్లుగా నిర్విఘ్నంగా కొనసాగుతూ వస్తోంది.

నగరోత్సవం నిర్వహణ ఇలా..

ఇంద్రకీలాద్రి దిగువన శివాలయం మెట్ల దిగువ నుంచి కనకదుర్గానగర్ మీదుగా ఘాట్ రోడ్డుపై నుంచి తిరిగి సన్నిధి వరకు ఈ నగరోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఆరుగంటలకు రెండు కిలోమీటర్ల మేర గంట సేపు నగరోత్సవాన్ని నిర్వహిస్తారు. మల్లేశ్వరస్వామి ఆలయం నుంచి గంగా పార్వతీ సమేత పరమేశ్వరుల ఉత్సవమూర్తులను బయటకు తీసుకొచ్చి అలంకరించి పల్లకీపై ఉంచి మేళతాళాలు, సంప్రదాయ నృత్యాల మధ్యన అట్టహాసంగా ఊరేగిస్తారు. ఈ నగరోత్సవం వెంట అర్చకులు, దేవస్థాన సిబ్బంది, వైదికులు, కళాకారులు నడుస్తూ కొండమీదకు చేరుకుంటారు. పల్లకీని బోయీలూ కొండమీద వరకు మోస్తారు. కేరళకు చెందిన మేళం బృందం అగ్రభాగాన ఉంటుంది. దేవస్థాన సంప్రదాయ మేళం ఆ తర్వాత కొనసాగుతుంది. కేరళకు చెందిన సంప్రదాయ కళాకారులు నృత్య విన్యాస బృందం నగరోత్సవాన్ని అనుసరిస్తుంది. ఒళ్లు గగుర్పొడిచేలా కళాకారులు విన్యాసాలు ప్రదర్శిస్తారు. ఘాట్ మార్గంలోకి చేరుకున్న తర్వాత క్యూలలో ఉన్న భక్తులు ఆదిదంపతులను దర్శించుకుంటారు.

నేటి నుంచి 30 వేల మంది

భక్తులకు పాలు, మజ్జిగ అందిస్తాం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆలయ ప్రాంగణంలో పర్యటిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

లబ్బీపేట, పటమట: "దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఆదివారం నుంచి 30వేల మంది భక్తులకు పాలు, మజ్జిగ అందిస్తాం. భక్తుల రద్దీ మేరకు లడ్డూలు అందుబాటులో ఉంచుతాం." అని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం అమ్మవారిని మంత్రి దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. సామాన్య భక్తులకు సాఫీగా అమ్మవారి దర్శనమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శనివారం 18వేల మందికి అన్నప్రసాదం అందించామని తెలిపారు. కనకదుర్గా సౌందర్య లహరి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

సామాన్య భక్తులకు సాఫీ దర్శనమే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

వన్‌టౌన్, అక్టోబరు 5: సామాన్య భక్తులకు సాఫీ దర్శనం కల్పించడమే తమ లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. దుర్గగుడి మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. దర్శనానికి వచ్చే వీఐపీలు తమకు నిర్దేశించిన సమయాల్లోనే రావాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు వీఐపీల దర్శనానికి ఏర్పాట్లు చేశామన్నారు. అదే సమయాల్లో వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని సూచించారు. నిర్దేశించిన సమయాల్లో కాకుండా ముందుగా గాని తర్వాత గాని వస్తే 500 రూపాయల క్యూలో పంపుతామన్నారు.

యూనిఫాంలో దర్శనాలకు వెళ్లొద్దు: సీపీ రాజశేఖరబాబు

'క్యూ పద్ధతి పాటించకుండా దర్శనాలకు వచ్చే భక్తులను నియంత్రిస్తున్నాం. పోలీసు యూనిఫాంలో దర్శనాలకు వెళ్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించాం. రూ.500 దర్శనం ఆలస్యమవుతోంది. రూ.300 క్యూ వేగంగా కదులుతోంది. వీఐపీలకు టైం స్లాట్ ఇచ్చాం. కొంత ఇబ్బంది కలిగినా వారు అర్థం చేసుకోవాలి. సామాన్యులకు దర్శనం ఇబ్బందులు లేకుండా చేయాలన్న ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అస్త్రం యాప్‌ను ఉపయోగిస్తున్నాం. ఇప్పటివరకు లక్ష మందికి సైబర్ అవగాహన యాప్‌ను డౌన్‌లోడ్ చేశాం.' అని సీపీ రాజశేఖరబాబు తెలిపారు.

లక్ష దాటిన భక్తులు : ఈవో కేఎస్ రామారావు

'ఇప్పటి వరకు అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య లక్ష దాటింది. తొలి రోజున 49 వేల మంది, రెండో రోజున 65వేల మంది, శనివారం మధ్యాహ్నం వరకు 36వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. మూలా నక్షత్రం రోజున భారీగా భక్తులు వస్తారని అంచనా వేశాం. రెండు రోజుల్లో మొత్తం 28వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశాం. 3952 మంది తలనీలాలు సమర్పించారు. 1,39,906 లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారు. ఈసారి లడ్డూలను ఒక ప్యాకెట్‌గా ఇస్తున్నాం. ఆరు లడ్డూలను ప్యాకెట్‌గా చేసి కౌంటర్లలో అందుబాటులో ఉంచాం.' అని ఈవో రామారావు తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కోరుకున్నా

- ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు



రఘురామకృష్ణంరాజుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

వన్‌టౌన్: రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, అందుకు అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రజలపై అమ్మవారి అనుగ్రహం ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు తెలిపారు. శనివారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. తర్వాత మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఐదేళ్లలో అమ్మవారిని దర్శించుకోలేకపోయానన్నారు. జగన్మాత అనుగ్రహంతో ఇప్పుడు సాధ్యమైందన్నారు.

కనకదుర్గమ్మకు రూ.45.43 లక్షల ఆదాయం

వన్‌టౌన్: దసరా మహోత్సవాల్లో మూడో రోజైన శనివారం సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన ఆదాయ వివరాలను దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తంగా రూ.45,43,253 ఆదాయం వచ్చింది. రూ.500 రుసుము టికెట్లను 3,848 భక్తులు తీసుకోగా రూ.19.24 లక్షలు, రూ.300 టికెట్లను 1,733 మంది భక్తులు కొనుగోలు చేయగా రూ.5.19 లక్షలు, రూ.100 టికెట్ల ద్వారా 4.19 లక్షలు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.3.06 లక్షలు సమకూరిందని దేవస్థానం తెలిపింది. 20,451 లడ్డూలను విక్రయించామని పేర్కొంది. ఆరు లడ్డూల ప్యాకింగ్ ద్వారా 53,706 లడ్డూలను విక్రయించామని, దీని ద్వారా రూ.8.95 లక్షలు ఆదాయం వచ్చిందని, పరోక్ష కుంకుమార్చన ద్వారా రూ.24వేలు, సరస్వతీ అలంకారం రోజున పరోక్ష కుంకుమార్చన కోసం ముగ్గురు బుక్ చేసుకోగా రూ.15వేలు, పరోక్ష ప్రత్యేక చండీహోమం ద్వారా రూ.52వేలు, పరోక్ష ప్రత్యేక శ్రీచక్రార్చన ద్వారా రూ.69వేలు, పరోక్ష ఖడ్గమాల్చారన ద్వారా రూ.17,348లు, పుస్తకాలు, క్యాలెండర్ల ద్వారా రూ.1,780లు, విరాళాలు, తదితరాల ద్వారా రూ.2,17,640 సమకూరిందని పేర్కొంది.

బార్లపూడిలో జస్టిస్ కిరణ్మయి దంపతుల పూజలు



పూజల్లో పాల్గొన్న జస్టిస్ కిరణ్మయి దంపతులు

కూచిపూడి, అక్టోబరు 5: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి దంపతులు శనివారం మొవ్వ మండలం బార్లపూడిలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవ పూజల్లో పాల్గొన్నారు. మొవ్వ న్యాయస్థానం ఇన్‌చార్జ్ పి.మేరి స్వాగతం పలికారు. ఆలయ ధర్మకర్త కోనేరు మంజునాథ్ పర్యవేక్షణలో అర్చకులు దీవి రామకృష్ణమాచార్యులు, వెంకటేశ్వరకుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- ఇద్దరు యువకుల దుర్మరణం..మరో బాలుడికి స్వల్పగాయాలు.. వెల్లంకిలో విషాదఛాయలు



ధన్వంత్ (ఫైల్)



ఫణికుమార్ (ఫైల్)

వీరులపాడు, అక్టోబరు 5: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదం శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన వేల్పూరి ధన్వంత్(19), అచ్చి ఫణికుమార్(20), షేక్ ఇమ్రాన్(16) స్నేహితులు. కంచికచర్ల మండలం పరిటాలలో వ్యక్తిగత పనుల నిమిత్తం ముగ్గురు ఒకే బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా అప్పుడే పొలం పని ముగించుకుని రహదారిపైకి వచ్చి ఆగిన ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టారు. దీంతో ధన్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఫణికుమార్ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఇమ్రాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బెంగళూరులో మొదటి ఏడాది ఇంజనీరింగ్ చదువుతున్న ధన్వంత్ దసరా సెలవులకు ఇంటి వచ్చి ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. శనివారం పోస్టుమార్టం అనంతరం గ్రామంలోకి రెండు మృతదేహాలు రావడంతో వెల్లంకిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మచిలీపట్నం సుందరీకరణకు ప్రణాళికలు



ప్రణాళికలు సిద్ధం చేయాలని మునిసిపల్ అధికారులకు సూచిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్‌లో సుందరీకరణ పనులకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మునిసిపల్ అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు, తుపానులు సంభవించిన సమయంలో నగరంలో ముంపు నివారణకోసం నలుమూలల పంప్‌హౌస్‌లు నిర్మించి, నీటిని బయటకు పంపింగ్ చేసేందుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. చెత్త సేకరణకు అంచనాలను రూపొందించి తడిచెత్తను ఎరువుగా మార్చేందుకు ప్రణాళికను తయారుచేయాలన్నారు. కమిషనర్ బాపిరాజు, జిల్లా పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ అధికారి రామకృష్ణ, తహసీల్దార్ మధుసూధనరావు పాల్గొన్నారు.

క్షయరహిత జిల్లాగా కృష్ణాను తీర్చిదిద్దుదాం

- పీహెచ్‌సీ వైద్యులకు డీఎంహెచ్‌వో గీతాబాయి పిలుపు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5: కృష్ణాజిల్లాను క్షయ, కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు కృషిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి పిలుపునిచ్చారు. వైద్య, ఆరోగ్య సేవలపై శనివారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సమావేశపు హాలులో జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. కుష్టుతో బాధపడుతున్న వారిని గుర్తించి సకాలంలో వైద్య సేవలందించాలని సూచించారు. డాక్టర్ ఎ.వెంకట్రావు, డాక్టర్ వేణుగోపాలకృష్ణ, బి.రామారావు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

- అధిష్టానం ఆదేశాలు పాటిద్దాం.. టీడీపీ విస్సన్నపేట మండల నాయకులతో దేవదత్



విస్సన్నపేట మండలం నాయకులతో టీడీపీ తిరువూరు ఇన్‌చార్జి శావల దేవదత్

తిరువూరు, అక్టోబరు 5: 'టీడీపీ అధిష్టానం సూచనల మేరకు సమన్వంతో పనిచేద్దాం. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూద్దాం. నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటా, ఎవరికి ఏ పని ఉన్నా ముందుండి చేయిస్తా'. అని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్ హామీ ఇచ్చారు. శనివారం విస్సన్నపేట మండలంలోని పంచాయతీలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ కార్ల ర్యాలీతో పట్టణంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయానికి తరలివచ్చారు. పార్టీ బాధ్యతలు స్వీకరించిన దేవదత్‌ను అభినందించారు. తొలుత కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆ మండలం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ విస్సన్నపేట మండల నాయకులు నెక్కళపు వెంకటేశ్వరరావు, బడా శ్రీను, కవులూరి రాజా, ఆకుల రాధాకృష్ణ, మట్ట వేణు, ఆ మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, తెలుగుమహిళా సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

తుక్కునూ మెక్కేశారు

(ఐదో పేజీ తరువాయి)

మాయం చేశారు. కొందరు అవినీతి మున్సిపల్ అధికారుల సహకారంతో ఓ వైసీపీ నాయకుడు రాత్రికిరాత్రే ఇలా మాయం చేశారని తెలుస్తోంది.

పంచాయతీలనూ వదల్లేదు

వైసీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీల్లో రక్షిత మంచినీటి సరఫరా కేంద్రం వద్ద నీటి మోటార్లు, పాత విద్యుత్ స్తంభాలకు కూడా రక్షణ లేకుండాపోయింది. దొరికిన కాడికి దోచుకున్నారు. గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు శ్రీకాళహస్తి కాలనీలో తుప్పుపట్టి ప్రమాదకరంగా మారిన విద్యుత్ ఐరన్ స్తంభాలను తొలగించి వాటిస్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. సుమారు 100 ఐరన్ స్తంభాలను వైసీపీ నాయకుడు, పంచాయతీ అధికారి సహకారంతో తరలించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. స్థానికంగా ఉన్న పాత ఇనుము వ్యాపారికి టన్ను రూ.38 వేల చొప్పున సుమారు 5 టన్నుల పాత ఇనుమును అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. అలాగే, పాత మోటార్లను సొంత అవసరాలకు తరలించుకుపోయారు. ప్రస్తుతం స్థానిక టీడీపీ నాయకుడు మహ్మమద్ ఇషాక్ ఆరా తీయగా, గుట్టుచప్పుడు కాకుండా మోటార్లను తీసుకొచ్చి కార్యాలయంలో పెట్టినట్టు సమాచారం. మోటూరు గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం వద్ద పాత ఇనుప పైపులు, మోటార్లను కూడా ఇలాగే తరలించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

చర్యల నుంచి తప్పించుకునేందుకు..

గత ఐదేళ్లలో తాము సాగించిన దోపిడీపై కూటమి ప్రభుత్వ చర్యల నుంచి తప్పించుకునేందుకు వైసీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఏదో ఒక విధంగా టీడీపీలో చేరిపోతే, బయటపడొచ్చని.. ఆ దిశగా ప్రణాళికలు వేసుకుంటున్నారు. వీరంతా టీడీపీ పట్టణ మైనారిటీ నాయకుడి ప్రోద్బలంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు సమక్షంలో చేరేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రెండు, మూడుసార్లు జిల్లా అధ్యక్షుడిని కలిసినట్లు సమాచారం. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రామును పక్కనపెట్టిన మైనారిటీ నాయకుడు ఈ వ్యవహారాన్ని చక్కబెట్టే ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

విచారణ జరపాలి

మున్సిపాలిటీ, పంచాయతీ పరిధిలో వైసీపీ పాలనలో జరిగిన దోపిడీపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని, కారకులైన వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని టీడీపీ, జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే దృష్టిసారించి దోచుకుపోయిన ప్రభుత్వ ధనాన్ని రెవెన్యూ రికవరీ యాక్టు ద్వారా వసూలు చేయాలని, సహకరించిన ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

శక్తిపటాల ఊరేగింపు కొట్లాట కేసులో

17 మందికి రిమాండ్

- వారిలో 13 మంది గుడ్లవల్లేరు కళాశాల విద్యార్థులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5: బలరామునిపేటలో గురువారం తెల్లవారుజామున శక్తిపటాల ఊరేగింపు సందర్భంగా జరిగిన కొట్లాట కేసులో 17 మందిని అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు పంపారు. డీఎస్పీ సుభాని, ఆర్‌పేట సీఐ ఏసుబాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. శక్తిపటాల ఊరేగింపు జరుగుతున్నప్పుడు పాత తగాదాల నేపథ్యంలో బడుగు త్రినాథ్, జొన్నలగడ్డ వరప్రసాద్, దొంతు పృధ్వీరాజ్‌లపై 17 మంది దాడి చేశారు. వారిలో బడుగు త్రినాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన సంగతి విదితమే. దాడిలో పాల్గొన్న వెన్నా మోహన్, మణికంఠ, కొల్లా శివ, కొల్లా సాయి, వెన్నా జగన్, పీర్ రాక్స్‌తో పాటు మరో 11 మందిని ఆర్‌పేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. హత్యాయత్నం కేసు కింద నమోదు చేసి 17 మందిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు పంపారు. వారిలో గుడ్లవల్లేరు కళాశాల విద్యార్థులు 13 మంది ఉండటంతో పోలీసుస్టేషన్ వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శక్తిపటాల ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని, మద్యం తాగి కొందరు ఊరేగింపులో పాల్గొం టున్నట్టు ఫిర్యా దులు అందుతున్నాయని, కఠిన చర్యలు తప్ప వని డీఎస్పీ, సీఐ హెచ్చరించారు.



బ్యాడ్మింటన్ పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మేడేపూడి సుబ్బారావు మెమోరియల్ ఇండోర్ షటిల్ స్టేడియంలో విజయదశమి సందర్భంగా అక్టోబరు 11, 12 తేదీల్లో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి వీరమాచనేని నాగయ్య శనివారం తెలిపారు.

మార్పులకు అనుగుణంగా వృత్తిని ఎంచుకోవాలి



గ్రాడ్యుయేషన్ పట్టాను అందిస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అకాడమిక్స్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. బాలకృష్ణ

ప్రసాదంపాడు, అక్టోబరు 5 : సమాజంలో మార్పులకు అనుగుణంగా తమ వృత్తిని ఎంచుకోవాలని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ అకాడమిక్స్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. బాలకృష్ణ అన్నారు. శనివారం ఎనికేపాడు విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో 2024 బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ భవాని, ఎస్.ఆర్.కె కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు, బి. ప్రతాప్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవలక్ష్మి, ప్రిన్సిపాల్ కె. పద్మలత పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

ఉయ్యూరు, అక్టోబరు 5 : మహిళల రక్షణకు అనేక చట్టాలు అమలులో ఉన్నాయని ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి అన్నారు. స్థానిక కేసీపీ ఆడిటోరియంలో శనివారం విధాన్ సే సమాధాన్, జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మహిళల హక్కులపై మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపీచంద్, గుండు శ్రీకృష్ణకుమార్, న్యాయవాదులు గీతాంజలి, ధనలక్ష్మి, దివ్యాంజలి, మోర్ల అంకశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలి



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఉంగుటూరు, అక్టోబరు 5 : కాలానుగుణంగా మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు మంచిపట్టు సాధించడంతోపాటు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీటీ అకాడమీ రిలేషన్‌షిప్ మేనేజర్ ఎస్.దినకర్‌రెడ్డి అన్నారు. ఐసీటీ అకాడమీ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ (ఆర్‌పీఏ), సాఫ్ట్ స్కిల్స్‌పై తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో గత 20 రోజులుగా జరుగుతున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, సీఎస్‌ఈ విభాగాధిపతి ఎస్ఎం రాయ్‌చౌదరి, ఏఐ విభాగాధిపతి కేపీఎన్‌వీ సత్యశ్రీ, ఆర్ అండ్ డీ డీన్ సాగర్ పాల్గొన్నారు.

అంగన్వాడీలో సామూహిక సీమంతాలు



కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఇందిర

ఈడుపుగల్లు (కంకిపాడు), అక్టోబరు 5 : సంప్రదాయ బద్ధంగా సీమంతాలు నిర్వహించటంతో పేదల్లో కలిగే ఆనందం వర్ణనాతీతమని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుందరమణి, షేక్ కాజమ్మ, డి. సునీత, షేక్ మీరాబి, వసంతకుమారి, రామలక్ష్మి పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 5 : మల్లవల్లి గ్రామానికి చెందిన ఖాసీంవలి (32) కొన్ని రోజులుగా కనిపించడం లేదని భార్య షేక్ షాహీన వీరవల్లి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... మల్లవల్లికి చెందిన ఖాసిం మోపెడ్‌పై గ్రామాల్లో తిరుగుతూ ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకునే వ్యాపారం చేసే వాడని, గత వారం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఇంత వరకూ తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఇంటిలో దాచి ఉంచిన రూ. 66వేలు కూడా కనిపించడం లేదని ఫిర్యాదులో వివరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

హుషారుగా ఫ్రెషర్స్ డే



ఉయ్యూరు, అక్టోబరు 5 : విద్యార్థుల డ్యాన్స్‌లు, ఆటపాటల కేరింతలతో శ్రీశ్రీనివాసా విద్యాసంస్థల ఆవరణ మార్మోగింది. శ్రీశ్రీనివాస కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఆద్యంతం విద్యార్థులను ఉర్రూతలూగించింది. విద్యా సంస్థల అధిపతులు పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఐఐటీ, నీట్‌లలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బాపులపాడు కార్యదర్శిగా పూర్ణేశ్వరి

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 5 : బాపులపాడు పంచాయతీ కార్యదర్శిగా శేషపుపూర్ణేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కార్యదర్శి సీహెచ్ ప్రసాద్ గన్నవరం మండలం కేసరపల్లి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పూర్ణేశ్వరి తోట్లవల్లూరు మండలం గరికపర్రు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. పంచాయతీ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. క్రమశిక్షణతో పనిచేసి గ్రామానికి మంచి పేరు తెచ్చిపెట్టాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

- రూ. 40 లక్షలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- సాయిపురం గ్రామసభలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



సాయిపురంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సాయిపురం(ఉయ్యూరు), అక్టోబరు 5 : గత ప్రభుత్వ నిర్వాకంతో గ్రామాభివృద్ధికి నోచుకోక ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా శనివారం సాయిపురంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రెయిన్ సౌకర్యం లేక ఇబ్బంది పడు తున్నామని, గ్రామానికి వచ్చే మూడు జడ్పీ రోడ్లు గుంతలమయంగా ఉన్న నేపథ్యంలో ద్విచక్రవాహనం కూడా నడపడానికి వీలులేకుండా పోయిందని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చా రు. రూ.40 లక్షలతో గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపడతారని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తార న్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. గ్రామ సర్పంచ్ షేక్ జాన్ బాషా, మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, అధికారులు పాల్గొన్నారు.

జంక్షన్ నుంచి వాహనాల మళ్లింపు



బొమ్ములూరు వద్ద వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 5 : విజయ వాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహి స్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా హనుమాన్‌జంక్షన్‌లో పోలీస్ యంత్రాంగం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై జనార్దన్ ట్రాఫిక్ మళ్లింపునకు శ్రీకారం చుట్టారు. దసరా ఉత్సవాలు నేపథ్యంలో విజయ వాడ నగరం మీద ట్రాఫిక్ పడకుండా జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. వాహనాలను దారి మళ్లిస్తు న్నారు. విశాఖపట్టణం నుంచి హైదరాబాద్ వెళ్లే గూడ్స్, ఇతర భారీ వాహనాలను నూజివీడు, మైలవరం, ఇబ్రహీంపట్నం మీదుగా మళ్లిస్తున్నారు. శనివారం బొమ్ములూరు వద్ద బైపాస్ ప్రారంభం పాయింట్ వద్ద విజయవాడ వెళ్లే మార్గంలో ట్రాఫిక్ డైవర్షన్ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వైజాగ్ నుంచి హైదరాబాద్ వెళ్లే గూడ్స్ వాహనాలను మాత్రమే ట్రాఫిక్ మళ్లిస్తున్నారు

వరద బాధితుల సహాయార్థం రూ. లక్ష వితరణ

కంకిపాడు, అక్టోబరు 5 : వరద ప్రభావిత ప్రాంతాలు, బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకు నియోజకవర్గ ప్రజలు అండగా నిలిచారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. వరద బాధితుల సహాయార్థం మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన కానూరు శివ శంకరరావు సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. లక్ష ఆర్థిక సాయాన్ని శనివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి నాగ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు టీడీపీ మండల మాజీ అధ్యక్షులు కొండవీటి శివయ్య, వర్మ, భాస్కర్, తమ్మిశెట్టి మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రూ. లక్ష అందజేస్తున్న శివశంకరరావు



దామచర్ల సత్యను అభినందిస్తున్న బోడె

దామచర్ల సత్యకు బోడె ప్రసాద్ శుభాకాంక్షలు

పెనమలూరు : ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు ఛైర్మన్‌గా శనివారం బాధ్యతలు చేపట్టిన దామచర్ల సత్యనారాయణ(సత్య)ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తన నియోజకవర్గ నాయకులతో మంగళగిరిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పెనమలూరు టీడీపీ అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, పార్టీ సమన్వయకర్త చిన్నారి తదితరులు ఉన్నారు.

కొనకళ్లకు యార్లగడ్డ అభినందన



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 5 : ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీని అభివృద్ధిపథంలో నడపగల సత్తాగల నాయకుడు కొనకళ్ల నారాయణ అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడలో శనివారం ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొనకళ్లకు ఆళ్ల గోపాలకృష్ణతో కలిసి పుష్పగుచ్ఛంతో శుభాభినందనలు తెలిపారు.

చంద్రఘంటాదేవిగా పార్వతి అమ్మవారు



విజయవాడ కల్చరల్, అక్టోబరు 5 : యనమలకుదురు శ్రీరామలింగేశ్వర స్వామి వారి దేవ స్థానంలో దసరా మహోత్సవాలలో భాగంగా మూడో రోజు శనివారం శ్రీపార్వతి అమ్మ వారిని చంద్రఘంటాదేవిగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి విశేష అర్చనలు, చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈవో ఎన్.భవానీ పాల్గొన్నారు.

శ్రీవెంకమ్మ పేరంటాలు దేవస్థానంలో..



ప్రసాదంపాడు : రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరం టాలు అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం కుంకుమార్చన, చండీహోమం ఘనంగా నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా..



కంకిపాడు : స్థానిక శివాలయంలో శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శన మిచ్చింది. అనంతరం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గజలక్ష్మిగా జగదాంబ

ఉయ్యూరు : శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ అధికారి వీడీడీ ప్రసాద్ పర్యవేక్షించారు.

ధైర్యలక్ష్మిగా రాజ్యలక్ష్మి

హనుమాన్‌జంక్షన్ : శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రాజ్య లక్ష్మి అమ్మవారు ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రంగన్నగూడెంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ పందిరిలో అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆళ్ల గోపాలకృష్ణ, మణికృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వెనిగళ్ల జ్ఞానశేఖర్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నపూర్ణదేవిగా లక్ష్మీతిరుపతమ్మ

గన్నవరం : శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శనివారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిలకపాటి సుబ్బారావు, అనురాధ, పేరిన వెంకట్రావు, శ్రీలక్ష్మీ, లావు సాయి కిషోర్ చౌదరి, శ్రీలక్ష్మీ, కొమ్మినేని ప్రవీణ్, విమల, మోదుగుమూడి వేణుగోపాలరావు, రమాదేవి దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భవానీలకు అన్నప్రసాద వితరణ



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 5 : అన్నిదానాల్లో కన్నా అన్నదానం గొప్పదని అలాంటిది భవానీ మాలదారులకు అన్నప్రసాద వితరణ సేవలందించడం అమ్మవారు కల్పించిన మహద్భాగ్యమని పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్ కుమార్ అన్నారు. బొమ్ములూరు ఫ్యాక్టరీ ఆవరణలో శనివారం శాస్త్రోక్తంగా భవానీలతో కలిసి ఆయన పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణను ప్రారంభించారు.

కృష్ణా

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.535

రాజరాజేశ్వరీ దేవికి బంగారు కంఠాభరణం



అవనిగడ్డ, అక్టోబరు 5 రాజశేఖరస్వామి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా సీనియర్ న్యాయవాది వల్లభనేని రామారావు దంపతులు రూ.1.13 లక్షల విలువైన కంఠాభరణాన్ని రాజరాజేశ్వరీ దేవికి సమర్పించారు. వల్లభనేని రామారావు, ఆయన సతీమణి కృష్ణకుమారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆభరణాన్ని ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు)కు అందజేశారు. వేదపండితులు ఆభరణాన్ని అమ్మవారికి అలంకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సింహాద్రి రామనాథబాబు, పురోహితులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామరాజుపాలెంలో ఈ-క్రాప్ నమోదు పొలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఈ-క్రాప్ నూరుశాతం నమోదుకు కృషి : కలెక్టర్

గూడూరు, అక్టోబరు 5 : జిల్లాలో ఈ క్రాప్ నూరుశాతం నమోదు చేసి సంక్షేమ పథకాలు రైతులకు అందేలా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ డి.కె. బాలాజీ అన్నారు. కలెక్టర్ బాలాజీ శనివారం మండల పరిధిలోని రామరాజుపాలెం గ్రామంలో ఈ క్రాప్‌ను నమోదు చేసిన పొలాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు ఈ క్రాప్ 99 శాతం నమోదు చేశారని, 89 శాతం ఈకేవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్. పద్మావతి, ఏఏఓ శివప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆటోలకు తాళ్లుకట్టి లాగుతూ నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

సీఎన్‌జీ కొరత నివారించాలంటూ నిరసన

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలో సీఎన్‌జీ కొరతను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ సీఐటీయూ నాయకులు, ఆటో వర్కర్లు ఆటోలకు తాళ్ల కట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోలినాయుడు మాట్లాడుతూ, మచిలీపట్నంలో ఒకే ఒక్క సీఎన్‌జీ ఫిల్లింగ్ కేంద్రం ఉందని, దీని వల్ల ఆటో డ్రైవర్లు గ్యాస్ ఫిల్ చేసేందుకు పామర్రు, గుడివాడ, నాగాయలంక వెళ్లాల్సి వస్తోందన్నారు. మచిలీపట్నంలో దాదాపు 500 ఆటోలు ఉన్నాయని, గ్యాస్ కొరత ఆటో డ్రైవర్లు ఉపాధిని కోల్పోతున్నారన్నారు. మరో సీఎన్‌జీ ఫిల్లింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బి. సుబ్రహ్మణ్యం, కరీముల్లా, వెంకటేశ్వరరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

గుడివాడ : ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఏలూరు రోడ్డులోని ప్రజావేదికలో విద్యుత్ శాఖలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ఈ సత్యానందం, డీఈ బి శ్రీనివాసరావు, ఏడీఈ గోరంట్ల గోవిందరావులతో ఎమ్మెల్యే పలు అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల వరదల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయించాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బంటుమిల్లి టీడీపీ పార్టీ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలుచేస్తామన్నారు. జనసేన నాయకులు సురేష్, కూనపరెడ్డి వీరబాబు, నజీర్, కొండా, బండారు సత్యనారాయణ, తదితర నాయకులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కాగిత

పెడనలో ప్రజాదర్బార్ రేపు

పెడన రూరల్ : సోమవారం ఉదయం 9 గంటలనుండి 12 గంటలవరకు పెడన టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రజాదర్బార్ నిర్వహిస్తారని మండల టీడీపీ అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్ తెలిపారు. పెడన మండల, పట్టణ ప్రజలు ఈ ప్రజాదర్బార్‌లో పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాల్సిందిగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు

కృత్తివెన్ను : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం కృత్తివెన్ను ప్రధాన సెంటర్‌లో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పీతలావ గ్రామానికి చెందిన వట్టికూటి ఆదినారాయణ, అనంతలక్ష్మీ దంపతులు బంటుమిల్లి వైపు నుంచి బైక్‌పై వెళ్తున్నారు. కృత్తివెన్ను సెంటర్‌లో తమ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలో అనంతలక్ష్మీ (58) మృతి చెంది. తీవ్ర గాయాలైన ఆదినారాయణ బంటుమిల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



మృతురాలు అనంతలక్ష్మి / గాయపడిన ఆదినారాయణ

జపమాల మహోత్సవంలో ఎమ్మెల్యే కుమార్‌రాజా

పామర్రు : కురుమద్దాలి ఆర్‌సీఎం చర్చిలో శనివారం జపమాల మహోత్సవంలో ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ భారతి, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, వల్లూరిపల్లి గణేష్‌గ్రామ టీడీపీ నేత వెంకటేశ్వరావు, మద్దాల భార్గవి తదితరులు పాల్గొన్నారు

చట్టాలపై అవగాహనతో మహిళలకు రక్షణ

బంటుమిల్లి, అక్టోబరు 5 : చట్టాలను సద్వినియోగం చేసుకుని మహిళలు రక్షణ పొందాలని జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి వి.ఆర్.కృష్ణయ్య అన్నారు. బంటుమిల్లి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ నైతిక విలువలు, వివాహ వ్యవస్థ నాశనం కావడంతో సమాజం భ్రష్టు పట్టిందన్నారు. కుటుంబ వ్యవస్థలో నైతిక విలువలు పాటిస్తే సమాజం మెరుగుపడు తుందన్నారు. మండల న్యాయసేవాసాధికార సంస్థ చైర్మన్ న్యామూర్తి భాస్కరరావు మహిళా చట్టాలపై, సీడీపీవో సముద్రవేణి వన్ స్టాప్ పథకం అంశాలను వివరించారు. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యం లో కొడుకు వల్ల భద్రత కరువైందని, వాటికి మూలాలు తెలుసుకుని సమూలంగా నాశనం చేయాలన్నారు. తహసీల్దార్ భరత్‌రెడ్డి, బంటుమిల్లి, కృత్తివెన్ను ఎస్సైలు గణేష్, పైడిబాబు, న్యాయవాదులు యాళ్ల శ్యామ్‌బాబు, పళ్లెం వీర వెంకటేశ్వరరావు, తమ్మన సురేష్, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సాధికార సంస్థ కార్యదర్శి వి.ఆర్.కృష్ణయ్య

ఆర్డీవో స్వాతి బాధ్యతల స్వీకారం



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5 : మచిలీపట్నం ఆర్డీవోగా కె.స్వాతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ బాలాజీని స్వాతి మర్యాద పూర్వకంగా కలిశారు.

గురజాడలో అగ్నిప్రమాదం

పమిడిముక్కల : గురజాడలో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో కాండ్రు తిరుపతయ్యకు చెందిన గొడ్ల చావిడి, వరిగడ్డి వామి దగ్ధమయ్యాయి. నాలుగు గేదెలకు తీవ్రంగా కాలినగాయాలయ్యాయి. ఎమ్మెల్యే కుమార్ రాజా సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 5 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రధాన దేవాలయాల్లో అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కుంకుమార్చన, సువాసినులు లలిత సహస్ర నామ పారాయణ జరిపారు. గీతా మందిరంలో కోటి కుంకుమార్చన నిర్వహించారు. **పెడన :** పైడమ్మ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. కన్యకా పరమేశ్వరీ దేవి అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో హోమం, కుంకుమార్చన, లలిత పారాయణ నిర్వహించారు. **గుడ్లవల్లేరు :** వేమవరం కొండాలమ్మ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చన, గాయత్రీ హననం, హోమం నిర్వహించారు. భజనలు, కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారికి ఊంజల సేవ, పంచహారతులు ఇచ్చారు. ఈవోఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **గుడివాడ :** భీమేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వేణుగోపాలస్వామి దేవస్థానంలో అమ్మవారు వైష్ణవి దేవిగా దర్శనమిచ్చారు. ఈవో కె.వి గోపాలరావు పర్యవేక్షించారు. . **గుడివాడ రూరల్ :** చిన ఎరుకపాడు అష్టలక్ష్మి దేవాలయంలో గజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సహస్ర నామార్చన, అష్టోత్తర అర్చన విశేషం గా పూజలు నిర్వహించారు. **చల్లపల్లి :** కన్యకా పరమేశ్వరీ వారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. **కోడూరు :** మండలంలోని పలు ఆలయాల్లో అన్నపూర్ణాదేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధన జరిపారు. ఆ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ కోట రాంబాబు పర్యవేక్షించారు. **మోపిదేవి :** పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి, మోపిదేవి సకలేశ్వరస్వామి, కొక్కిలిగడ్డ మల్లేశ్వరస్వామివారి ఆలయాల్లో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నడకుదురు పృధ్వీశ్వరస్వామి ఆలయంలో బాలా త్రిపుర సుందరీ దేవి, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీపురం దుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. **అవనిగడ్డ :** దివి వాసుల ఇలవేల్పు లంకమ్మ, రాజరాజేశ్వరిదేవి శని **అవనిగడ్డ రూరల్ :** వేకనూరులో అంకాలమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాదివాడ శ్రీనివాస పెరుమాళ్ల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సూర్యనారాయణస్వామి దేవాలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అశ్వారావుపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుట్ట దగ్గర కనకదుర్గమ్మకు పూజలు నిర్వహించారు. **నాగాయలంక :** దుర్గా గణపేశ్వరస్వామి ఆలయంలో గాయత్రిదేవిగా, కన్యకా పరమేశ్వరి, వాసవీ బాలాత్రిపుర సుందరిదేవిగా, పార్వతీ అన్నపూర్ణాదేవిగా, శ్రీరామపాదక్షేత్రం దుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త మండల రాంబాబు, ఈవో సిహెచ్.సుధాకరరావు, చైర్మన్లు చిట్టా సాంబశివరావు, ఆలూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. **పామర్రు :** గంగాపార్వతి సమేత సోమేశ్వరస్వామి (శివాలయం) దేవాలయంలో గాయత్రీ దేవిగా, అంకమ్మతల్లి సంతానలక్ష్మీదేవిగా, వాసవీ కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. పెదమద్దాలి, కురుమద్దాలి దేవాలయాల్లో విశేష పూజలు జరిగాయి. **పెదపారుపూడి :** మూడవ రోజు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ అధికారుల నిర్లక్ష్యంపై సర్పంచ్‌ల ఆగ్రహం

చల్లపల్లి : డ్రైనేజీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు విమర్శించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోట విజయ రాధిక అధ్యక్షతన శనివారం జరిగింది. డ్రైనేజీ శాఖ సమీక్ష సమయంలో ఆ శాఖ అధికారులు సమావేశానికి రాలేదని తెలియటంతో సర్పంచ్ మండిపడ్డారు. భారీ వర్షాలకు పంటపొలాలు ముంపునకు గురయ్యాయనీ, మంగళాపురంలో వందల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేసినా కనీసం స్పందించడం లేదన్నారు. రైతుల సమస్యలకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. 9/2 కాలువకు సంబంధించి మూడేళ్లుగా విడుదలైన నిధుల వివరాలు, కాల్వగట్ల పాటల డబ్బులు ఏం చేశారో చెప్పాలన్నారు. మండల పరిషత్ సమావేశానికి డ్రైనేజీ అధికారులు గైర్హాజరు కావటం సరికాదని ఎంపీడీవో వెంకట రమణ అన్నారు. 10 రోజుల ముందుగానే సమావేశం నోటీసు అందజేస్తారనీ, సమావేశం రోజున ఎలాంటి షెడ్యూల్స్ లేకుండా అధికారులు సమావేశానికి రావాల్సిందేనన్నారు. ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాధ్, పైడిపాముల స్వప్న సమస్యలు తెలియచేశారు.

వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

మోపిదేవి : వ్యవసాయ కళాశాల విద్యార్థులు రావివారిపాలెం రైస్ మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రామసర్పంచ్ నందిగం మేరీ రాణి, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ శ్రీలక్ష్మి ప్రారంభించారు. గ్రామాల్లో కళాశాల విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించిన అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను గ్రామస్థులు, రైతులు, కళాశాల అధ్యాపక బృందం పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీలత, రావే కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.లక్ష్మి, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, వీఆర్వో రమణ, రైతులు పిచ్చేశ్వరరావు, శ్యామ్ ఉన్నారు.

అలరించిన తాళం భజన పోటీలు

ఘంటసాల : చిట్టూర్పులో నిర్వహిస్తున్న తాళం భజన పోటీలు భక్తిభావాన్ని కలిగించాయి. మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం జరిగిన పోటీల్లో ఐదు సమాజాలు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతలుగా పొడుగు ప్రభాకర్‌రావు, ఏసుపాదం వ్యవహరించారు. పోలవరం శ్రీ శ్యామల లలిత భజన సమాజం, శ్రీకాకుళం కాశీకృష్ణ భజనసమాజం ప్రదర్శన ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు గుత్తికొండ వరప్రసాద్, కమిటీ సభ్యులు ఐదు భక్త సమాజ సభ్యులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. నిర్వాహక కమిటీ సభ్యులు వేమలపల్లి సుధీర్, దాసరి సతీష్, దాసరి సురేష్ పర్యవేక్షించారు.



చల్లపల్లి, గుడ్లవల్లేరులలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

చల్లపల్లి : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు, విశ్రాంత ఎంఈవో వేమూరి మురళీకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు దాసరి రామ్మోహనరావు, వేమూరి రాధాకృష్ణ, కంఠంనేని సుధాకరరావు, దోనేపూడి సురేంద్ర, విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావులను ఘనంగా సన్మానించారు. కస్తూరి ప్రసాద్, ముమ్మనేని నాని, నర్రా సాయిబాబు, ఎస్‌జిఎ.భాషా, ప్రసాద్, కొల్లిపర మధు, కాట్రగడ్డ రామ్మోహనరావు, టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చంద్రాల పాఠశాల ఉపాధ్యాయులు కలపాల రత్నం, ఎం. ఆరోగ్యం, సిహెచ్ శ్రీనివాస్, ఎం.శ్రవంతిలను సన్మానించారు. శశికళ, కల్యాణపు నవాబు, ప్రసాద్, ఎ.రామ్మోహనరావు, బొప్పన శివప్రసాద్, జంగం మోహనరావు,సూరపనేని పరంధామయ్య, సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **పెడన :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విశ్వభారతి హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిధిగా హాజరైన హాజీ బేగ్ విచ్చేసి ఉపాధ్యాయులను సత్కరించారు. మట్టా రాధాకృష్ణమూర్తి, ఎంపీడీవో వై.వి. హరనాథ్, అనుముకొండ గౌరీప్రసాద్, పి. మధుసూదనరావు, ఉమ్మిటి విద్యాధర్, టి. రాజీవ్, ఖుర్షిద్‌బేగం, బెల్లంకొండ లక్ష్మణ్, ఊటుకూరి సుబ్బారావు, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఈ సత్యానంద్ బాధ్యతల స్వీకారం



మచిలీపట్నం టౌన్ : ఎలక్ట్రికల్ ఎస్ఈ సత్యానంద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళుతున్న భాస్కరరావు ఆయనకు అభినందనలు తెలిపారు. వరద సమయంలో ఉద్యోగులు, సిబ్బంది చేసిన సేవలను మరచిపోలేమన్నారు.

ఇసుక టిప్పర్ల స్వాధీనం

పమిడిముక్కల : ఐలూరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.శ్రీను తెలిపారు. రెండు ట్రిప్పర్లను తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించామన్నారు. ఇసుక అక్రమ రవాణచేస్తే ఉపేక్షించేది లేదన్నారు.

స్వచ్ఛతా హి సేవపై పోటీలు

మచిలీపట్నం టౌన్ : కేంద్రీయ విద్యాలయంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ అహమ్మద్ బహుమతులు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

గుడివాడ : పాటిమీద వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానానికి పట్టణ ప్రముఖులు వీర్ల శ్రీరామ్ యాదవ్, సీతామహాలక్ష్మీ దంపతుల కుమారుడు బాల సాయి సుబ్రహ్మణ్యం రూ.1,02,100 చెక్కును ఈవో కె.వి గోపాలరావుకు అందజేశారు. దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ఎస్‌వీఎల్‌లో దసరా వేడుక

అవనిగడ్డ : ఎస్.వి.ఎల్.కళాశాలలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శన, మహిషాసురమర్ధిని నృత్య రూపకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.